

# అంతర్మథనం

రవీంద్ర

అది శోభనం గది. గది అంతా సెంటు వాసనతో ఘుమఘుమ లాడుతోంది. పట్టి మంచాన్ని సన్నజాజులతోను, మల్లెపూలతోను అందంగా అలంకరించారు. ఆ పూల గుబాళింపుతో సుభాష్ మనసు ఏదో లోకంలో విహరిస్తోంది "ఎంత సేపటికీ సునీత రాదేం.." అనుకుంటూ టైమ్ చూసుకుంటున్నాడు నిముషానికోసారి – ముస్తాబు చేస్తున్నారేమో! కొత్త పెళ్ళి కూతుర్ని. . అయినా ఎంత సేపు?! అనుకుంటూ గదిలో పచార్లు చెయ్యటం మొదలు పెట్టాడు కొత్త పెళ్ళి కొడుకు సుభాష్

మనస్సులో ఏదో మూల నుండి ఓ బాధ తొలుస్తోంది తనని–

తను నిజంగా సుజాతకి అన్యాయం చేశాడా??

## ఇ'వేమన' పద్యాలు

### ప్రియురాలు




వెలది సొంపు జూచి విఱ్ఱవీగుట లేల
కలికి గుణము గాదె కారణంబు
చలన చిత్త వృత్తి జారిణి కేమబ్బు
విశ్వదాభి రామ వినురవేమ

ఆఁ!! అన్యాయం ఏవుంది? తనకి నచ్చలేదు- కాదన్నాడు... అది తప్పా?-

తప్పా- తప్పున్నరా!! ఆమెకేం తక్కువ?? పచ్చని పసిమి ఛాయ- ఎప్పుడూ చిరునవ్వు చిందించే ముఖం... చలాకీగా వుంటుంది సుజాత- అందంతో పాటు చదువు గూడా వుంది. అంతకంటే ఏం కావాలి? - పైపెచ్చు వాళ్ళ నాన్నగారు తన నాన్నగారు చిన్ననాటి ప్రాణ స్నేహితులు.... తన చిన్నప్పుడే సంబంధం కలుపుకోవాలనే నిశ్చయించుకున్నారు కూడ-

అంతా బానే వుంది- కాని సుజాత చాల పొట్టి అందుకే తను వద్దన్నాడు-

పొట్టి అయితే ఏమిటట?

ఏవిఁటేవిఁటి? తనకి పుట్టే పిల్లలు గూడ పొట్టి వాళ్ళవుతారేమో.... అదీ భయం... అందుకే తన కిష్టం లేదని చెప్పాడు....

మరి సునీత నచ్చిందా??

నచ్చింది..., పచ్చని ... . తనకి తగ్గ ఎత్తు...

### అంతర్మథనం

ఆ ఎత్తుకు తగ్గ పర్సనాలిటీ.... కాకపోతే ఫేస్ చాల సీరియస్‌గా వుంటుంది.., పెళ్ళయిం తర్వాత తను వేసే జోక్స్‌కి ఆ సీరియస్‌నెస్ పోయి చక్కగా నవ్వుతూ వుంటుంది.... ఆ నమ్మకం తనకుంది-

వాళ్ల నాన్న ఇచ్చే లక్ష రూపాయల ఆస్తికి ఆశ పడి ఈ పెళ్ళికి ఒప్పుకొన్నాడంటే... తను కాదన గలడా?... లేదు. లేదు.. డబ్బు మీద తనకు వ్యామోహం లేదు- తను ఇంజనీర్... తన సంపాదన తనకి చాలు- హాయిగా బతగ్గలడు తను. తను గానీ, తన వాళ్ళు గానీ అడగలేదు... ఆయనే యిస్తున్నాడు.... వాళ్ళమ్మాయి పేరనే ఫిక్సిడ్ డిపాజిట్ చెయ్యమన్నాడు- తను.

ఇంతలో ఘల్లుమని కాళ్ళ గజ్జల చప్పుడు సుభాష్ చెవిన పడటంతో మనసులో జరుగుతున్న అంతర్మథనం సద్దుమణిగింది-

తలుపు గడియ పెట్టి చేతిలో పాల గ్లాసుతో అడుగులో అడుగేసుకుంటూ నెమ్మదిగా, వయ్యారంగా, హంసలా నడచి వస్తున్న సునీతను చూసి ముగ్ధుడయ్యాడు సుభాష్-

పాల గ్లాసు అందుకొని ప్రక్కనున్న టీపాయ్ మీద పెట్టి, నెమ్మదిగా సునీతని మంచం మీద కూర్చోబెట్టాడు-

"భార్యాభర్తల కాపురం ఆనందమయం కావాలంటే ఇరువురి మధ్య ఏ దాపరికాలుండ రాదు" అంటూ .. తన గురించి చెప్పవలసింది, చెప్పతగిందంతా దాచుకోకుండా చెప్పేశాడు సుభాష్-

సునీత కళ్ళ వెంబడి నీళ్ళు వస్తున్నాయి-

ఏమిటి? ఏం జరిగింది?! అడిగాడు సుభాష్ గాబరాగా-

చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది సునీత-

"నన్ను క్షమించండి. మా వాళ్ళు మీకు అన్యాయం చేశారు" అంది గద్గద స్వరంతో -

"నువ్వేం చెబుతున్నావో నా కర్థం కావట్లా" అన్నాడు సుభాష్-

రెండేళ్ళ క్రితం కారు యాక్సిడెంట్‌లో నా కుడి కాలు పోయింది... యిది జైపూర్ పాదం-

ఈ విషయం మా వాళ్ళు మీకు చెప్పకుండా దాచారు అంటూ చెప్పింది దీనంగా మొహం పెట్టి....

సుభాష్‌కి ఊబిలో కూరుకుపోతున్నట్లనిపిస్తోంది- ◘

ఇటీవల ఢిల్లీలో జరిగిన ఢిల్లీ తెలుగు సంఘం "వార్షికోత్సవ సభలో జ్యోతి వెలిగిస్తున్న ప్రముఖ నర్తకి యామిని కృష్ణమూర్తి, ప్రక్కన సంఘం అధ్యక్షులు శ్రీ డి. కృష్ణారావు

